క్లుప్తంగా

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ దేముడు


డాక్టర్ బి.దేముడు

మురళీనగర్: విశాఖపట్నం-వాల్తేరు క్లబ్ అధ్యక్షుడిగా మురళీనగర్‌కు చెందిన డాక్టర్ బోకం దేముడు ఎన్నికయ్యారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్(గైస్) పూర్వ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు నిర్వహించే కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటూ తన సేవా భావాన్ని తెలుపుతున్నారు. లయన్స్ క్లబ్ సభ్యుడిగా 2017–18 నుంచి క్లబ్ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో ఆయన ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 2022–23 సంవత్సరానికి ఆయన లయన్స్ క్లబ్ కార్యదర్శిగా పనిచేశారు. దేముడు సేవలను గుర్తించిన లయన్స్ క్లబ్ సభ్యులు 2024–25 లయనిస్టిక్ ఇయర్‌కు ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులు, ఇతర పెద్దలందరికీ ఆదివారం దేముడు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

వారాహికి కుంకుమ పూజ


లలితా పీఠంలో వారాహి అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న అర్చకుడు

సీతంపేట: లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో జరుగుతున్న వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చన చేశారు. వారాహి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అనాస పండ్లు నైవేద్యంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. లలిత పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కరాటేతో ఆత్మరక్షణ

మల్కాపురం: ఆత్మరక్షణకు కరాటే ఎంతో మేలు అని ఇండ్రస్టీయల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ అన్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో విశాఖ జిల్లా కరాటే చాంపియన్ షిప్ 2024 కరాటే పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బాలికలకు విద్యతో పాటు ఆత్మరక్షణకు కరాటే కూడా చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ పోలారావు, స్థానిక నాయకుడు కుంచారావు, తదితరులు పాల్గొన్నారు.

మేల్కోకుంటే ముప్పే..!

- 56, 57 వార్డుల్లో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- నేలకొరిగే స్థితికి చేరిన వైనం
- దృష్టి సారించని శాఖాధికారులు


గౌరీనగర్‌లో నేలకొరిగే స్థితిలో స్తంభం



విరిగిన విద్యుత్ స్తంభం


గొల్లకంచరపాలెంలో విద్యుత్ స్తంభాల వద్ద పక్కకు ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధిలో పలు చోట్ల సిమెంట్ విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. నేలకొరిగే స్థితిలో స్తంభాలు ఉండటంతో స్థానికులు, పాదచారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కంచరపాలెం, ఊర్వశి జంక్షన్ పరిధిలోని గొల్లకంచరపాలెం ట్రాక్ రహదారి, తోట వీధి, గౌరీనగర్, సుభాష్ నగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు శిథిలమై ప్రమాదభరితంగా మారాయి. గొల్లకంచరపాలెం రైల్వే ట్రాక్ రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఓ పక్కకు ఒరిగింది. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై విద్యుత్ శాఖ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాలు కురుస్తున్న వేళ.. ఈదురు గాలులకు స్తంభాలు కూలిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఎటువంటి నష్టం జరగకముందే ఈపీడీసీఎల్ అధికారులు దృష్టి సారించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు.

నేరాలకు దూరంగా ఉండండి

- రౌడీషీటర్లకు పోలీసుల సూచన


ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఏఎస్ఐ గంగాధర్ రెడ్డి

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ రమేష్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ గంగాధర్ రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్ల దినచర్య, కేసుల్లో ఉన్న వారి వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా మంచిగా నడుచుకోవాలని సూచించారు. నేరాల జోలికి వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని, సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు ఏఎస్ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించి వచ్చారు.


ఐదో పట్టణ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ భాస్కరరావు

సత్ప్రవర్తనతో మెలగండి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.భాస్కరరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లంతా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి అల్లర్లు, గొడవలు సృష్టించినా ఊరుకునేది లేదని హెచ్చరించారు., వాటి జోలికి వెళ్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుల నిఘా ఎల్లవేళలా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా అందరూ నడుచుకోవాలని, కుటుంబంతో కలిసి ఆనందంగా గడపాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో పడి మహిళ మృతి


కనకమహాలక్ష్మి మృతదేహం

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ లిఫ్ట్‌లో పడి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. శివాజీపాలేనికి చెందిన కనకమహాలక్ష్మి అనే మహిళ ద్వారకానగర్ మొదటి లేన్ బుధిల్ పార్కు సమీపంలోని ఓ దుకాణ కాంప్లెక్స్‌లో పనిచేస్తోంది. ఆదివారం మధ్యాహ్నం ఆమె కాంప్లెక్స్‌లోని లిఫ్ట్‌లో సామగ్రి తీసుకువెళ్తుండగా.. మూడో అంతస్తుకు వచ్చే మధ్యలో లిఫ్ట్ తలుపులు తెరుచుకున్నాయి. దీంతో అంతస్తును ఆనుకొని ప్రమాదవశాత్తు ఆమె పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ద్వారకా పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏయూ మెస్‌ల ఆకస్మిక తనిఖీ


మెస్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కిషోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు


ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల మెస్‌లను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కళాశాల, రీసెర్చ్ స్కాలర్స్, మహారాజీపేటలోని విద్యార్థినుల మెస్‌లను పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత, ఆహార పదార్థాల రుచి, నాణ్యత వంటివి ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెస్‌లలో సిబ్బంది ప్రవర్తన, పనితీరు, భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మెస్‌లలో పలు మార్పులు చేయాలని కోరారు. వాటికి త్వరలో పరిష్కారం చూపుతామని రిజిస్ట్రార్ హామీ ఇచ్చారు. తరచూ మెస్‌లను తనిఖీ చేస్తామని, నాణ్యతలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. మెస్‌లలో పని చేస్తున్న సిబ్బందితో నేరుగా మాట్లాడారు. రుచిగా, శుచిగా భోజనం అందించడానికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్‌లు బి.మునిస్వామి, కె.రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సింథటిక్ వాలీబాల్ కోర్టు ప్రారంభం


సింథటిక్ వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు

సింధియా: నౌకాదళ సిబ్బందిలో క్రీడా స్ఫూర్తి నింపేలా వైజాగ్‌లోని బేస్ విక్చువలింగ్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన సింథటిక్ వాలీబాల్ కోర్టును ఆదివారం రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు ప్రారంభించారు. అనంతరం వాలీబాల్ మ్యాచ్‌ను తిలకించి క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నేవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీలో రథయాత్ర సందడి


ప్రత్యేక అలంకరణలో శ్రీజగన్నాథ స్వామి


ఎంవీపీ కాలనీలో సాగుతున్న రథయాత్రలో పాల్గొన్న భక్తులు

ఎంవీపీ కాలనీ: శ్రీజగన్నాథ స్వామి రథయాత్ర ఎంవీపీ కాలనీలో ఆదివారం అట్టహాసంగా సాగింది. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సాయంత్రం ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులోని ఐఏఎం వద్ద రథయాత్ర ప్రారంభమైంది. అక్కడ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ కూడలి, ఇసుకతోట హైవే మీదుగా వెంకోజిపాలెం, ఎంవీపీ క్యాన్సర్ ఆస్పత్రి కూడలి మీదుగా రథయాత్ర అప్పుఘర్ బీచ్ రోడ్డుకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి ఎంవీపీ డబుల్ రోడ్డు వరకు కొనసాగింది. ఈ యాత్ర ప్రారంభం సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ శ్రీ జగన్నాథస్వామి రథయాత్ర వేదిక పంచాంగంలో ప్రాముఖ్యత పొందిందన్నారు. భారతీయ సంప్రదాయంలో ప్రేమకు, భక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఏటా హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మంగవేణి, ద్వారక ఏసీపీ ఎస్.రాంబాబు, వెలగపూడి ప్రతాప్, సుంకరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. యాత్రలో దారి పొడవునా సంప్రదాయ, సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన యాత్ర 8 గంటల వరకు కొనసాగింది. అనంతరం స్వామివారికి మంగళ హారతి పట్టారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే విద్య

మల్కాపురం: ఆత్మవిశ్వాసాన్ని పెంచేదిగా విద్య ఉండాలని రామకృష్ణ మిషన్ స్వామీజీ స్వశం వేద్యానందాజీ అన్నారు. రామకృష్ణ మిషన్ వద్ద జాతీయ సేవా పథకం ప్రొగ్రాం అధికారులు, ఎన్‌సీసీ ఆఫీసర్లకు యువజన అభివృద్ధిపై ఆదివారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. వ్యక్తిత్వ వికాసంపై, విద్యపై స్వామి వివేకానంద భావాలను తెలియజేశారు. సదస్సులో జాతీయ సేవా పథకం జిల్లా ప్రొగ్రాం అధికారులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, కో–ఆర్డినేటర్ డాక్టర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీపీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పైలా


ఆదిమోహన్‌రెడ్డి

డాబాగార్డెన్స్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీపీపీ) రాష్ట్ర అధ్యక్షుడిగా నగరానికి చెందిన పైలా ఆదిమోహన్‌రెడ్డి నియమితులయ్యారు. చీరాలలో ఆదివారం జరిగిన ఏబీపీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో 2024–26కు సంబంధించి రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రచార సభ జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాసు తెలిపారు. ఈ మేరకు ఆదిమోహన్‌రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అధ్యక్షుడితో పాటు 25 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేయడానికి కృషి చేస్తానన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన తప్పనిసరి


ప్రథమ చికిత్సపై శిక్షణ ఇస్తున్న మహ్మద్ రహ్మతుల్లా

మహారాణిపేట: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రెడ్ క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్రరెడ్డి అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రథమ చికిత్సపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో శివనాగేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రథమ చికిత్స చేసే వారికి ఉండాల్సిన లక్షణాలు, మానవ శరీరంలో ముఖ్య అవయవాలు, సీపీఆర్ ప్రక్రియ, నీటిలో మునిగిన వారికి చేసే చికిత్స, గుండెపోటు, వడదెబ్బ, మధుమేహం, జ్వరం, కలరా, డయేరియా, మూర్ఛ, విష ప్రయోగం, గాయాలకు కట్లు కట్టడం, రక్తస్రావం, పొలబారటం, కాలిన గాయాలు, కరెంట్ షాక్, పాము, తేలు కాటు సమయంలో విషం విరుగుటకు అందించాల్సిన తక్షణ ప్రథమ చికిత్సల గురించి అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో క్షతగాత్రులను తరలించే పద్ధతి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో అందించాల్సిన ప్రథమ చికిత్స పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా శిక్షకుడు మహ్మద్ రహ్మతుల్లాను శివనాగేంద్రరెడ్డి అభినందించారు. శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

సీతంపేట: సమాజంలో బ్రాహ్మణుల మనుగడకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని వివిధ వర్గాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు పిలుపునిచ్చారు. వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యువ రాజకీయ వేత్త ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ సమాజంలో అందరూ బాగుండాలని కోరుకునే వారిలో మొదటి వారు బ్రాహ్మణులేనని, అలాంటి వారు నేడు దుర్భర స్థితిలో ఉన్నారన్నారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా, వ్యాపార రంగాల్లో బ్రాహ్మణుల ఎదుగుదలకు అవరోధం కలిగించే శక్తులు ఎన్నో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయి కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. న్యాయవాది కె.వి.నరసింహమూర్తి మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ భవన్‌కు కొంత స్థలాన్ని కేటాయించగా.. దానికి కంచె వేశామన్నారు. బ్రాహ్మణ సంఘాల పేరిట ఇవ్వాల్సిన ఆ స్థలాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్, దేవదాయ శాఖ సంయుక్త పేరిట ఇవ్వడంతో దానికి క్లియరెన్స్‌లో జాప్యం జరిగిందని చెప్పారు. ఏపీ బ్రాహ్మణ ఐక్య వేదిక కన్వీనర్ సీవీఎస్ సాయిరామ్, వైద్యులు విజయశేఖర్, వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్, సంస్థ గౌరవాధ్యక్షులు టీఎస్సార్ ప్రసాద్, వివిధ సంఘాల ప్రతినిధులు నెమ్మలూరి శివగణేష్, దివాకర్, హనుమంతరావు, మహంతి, డాక్టర్ వాణి తదితరులు భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

టాలెంట్ వార్ అదుర్స్


వెస్ట్రన్ డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు


విజేతలతో మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్

సీతంపేట: చిన్నారులు తమ టాలెంట్‌తో అదరగొట్టారు. సోలో, గ్రూప్ డ్యాన్స్‌లతో, సింగింగ్‌తో ప్రతిభ చూపించారు. మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రెండు రోజుల పాటు టాలెంట్ వార్ పేరిట జరిగిన పోటీలకు ఆదివారం విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటారు. నాలుగేళ్ల నుంచి 25 ఏళ్ల వయసు గల పలువురు క్లాసికల్, ఫోక్, వెస్ట్రన్ డ్యాన్స్, సింగింగ్, మ్యూజిక్‌లో పోటీ పడ్డారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, ధ్రువ పత్రాలను ప్రదానం చేశారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు


కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు సుబ్రహ్మణ్యం, ప్రకాష్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్స్ కార్యక్రమం హాస్యం పండించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. వాటిలో తాత మనవడు మావ, గొట్టం గాడు, బ్యాంకు లోన్, అమలాపురం బస్సు, పిల్లిని చంపితే, సౌండ్ పార్టీ, జనాభా లెక్కలు, మిమ్మలనే ఫాలో అవుతున్నా, డాక్టర్ అలా చెప్పాడా స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భానుప్రకాష్, రామానుజం, సూర్యం, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, మల్లిక, నాగ గణేష్, సీతాగణేష్, భవాని, నాగరాజు అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. కార్యక్రమంలో అతిథులు నందూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, బాదంగీర్ సాయి, డి.జె.నాగరాజు, బొబ్బాది అప్పారావు కళాకారులను సత్కరించి అభినందించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన


కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పీఎంపాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. నగరంలోని శ్యామల కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుత నృత్యాలతో అలరించారు. గణపతి స్తుతి గీతానికి చేసిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా కళాకారులు దీక్షిత ,స్నిగ్ధ ప్రమిదలో వెలిగించిన దీపాలు చేతబూని ఘటాలపై ప్రదర్శించిన నృత్యాభినయాలు కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచాయి. కళకారులు మోక్షిత, సత్యవర్షిణి, రిషిత, జోషిత, శృతి, శ్రీజ, సహస్ర, అంజని, సమన్వి, కుందన ప్రియ, విద్య, ప్రణతి, లాస్య, శ్రావణి, దీక్షిత, చాందిని తదితరులు చేసిన నృత్యాలకు శ్యామల దర్శకత్వం వహించారు.

బడి బాగుకు...

ఏక తాటిపైకి పూర్వ విద్యార్థులు


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


మాట్లాడుతున్న వైఎస్ ప్రసాద్

గోపాలపట్నం: తమ చదువుల కోవెల బాగు కోసం పూర్వ విద్యార్థులు ఏకమయ్యారు. అందుకు తగిన కార్యచరణ రూపొందించారు. విద్యార్థులంతా కలిసి సంఘంగా ఏర్పడి పాఠశాలను అందరి సాయంతో అభివృద్ధి చేస్తామని తీర్మానించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఇక్కడి బాలికల పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. పాఠశాల ప్రారంభం నాటి నుంచి పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు చాలా మంది హాజరయ్యారు. 1963 నుంచి 2024 వరకు చదివిన విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి ఏవిధంగా తోడ్పాటునందిద్దామన్న పలు అంశాలపై చర్చించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. దీన్ని రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు బ్యాంక్ ఖాతా ప్రారంభించి నిధులు సేకరించనున్నారు.

నూతన కార్యవర్గం ఇదే

పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా మజ్జూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా వైఎస్ ప్రసాద్, కోశాధికారిగా సదరం శ్రీనాథ్, సంయుక్త కోశాధికారిగా కోనేటి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లుగా మహ్మద్ ఖలీల్ ఉర్ రహమాన్, కోల్కొండ శ్రీనివాసరావు, మేడిది రాజశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా కొయిలాడ వెంకటజగన్, శ్రీకుమార్, అల్లం రమేష్, న్యాయ సలహాదారుగా టి. సుగుణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వీరంతా పాఠశాల అభివృద్ధికి నిజాయితీగా కృషి చేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.